కథానిక

# దత్త పుత్రుడు

సమయమంత్రి వసంత దేవి

"అమ్మమ్మా! మరి నా కాలేజి జూనులో తెరుస్తారు. డబ్బు మాటేం చేశావ్!" అని అడిగాడు వంటింట్లో కందులు బాగు చేస్తూన్న కామాక్షమ్మను శేషాద్రి.

"అదేమిట్రా అబ్బీ! మొన్న నేగా ఫెరివేటు కంటే 250 యిచ్చాను, అప్పుడే మళ్ళీ డబ్బంటూ వేమిట్రా?" అంది కామాక్షమ్మ చెంపని చెయి జేర్చి.

"అస్తమానం నాకిదే పననుకున్నావా? అవసరంలేంది నిన్నడగడం దేనికి? కాలేజీలో డబ్బు కట్టకపోతే యెల్లాగనుకున్నావు? అదేం నీఅబ్బ కట్టించిందా, వట్టినే చేర్చుకోడానికి?"

"ఏదో తెలీకంటే, నా అబ్బ వరకూ పెద్దా వేంరా? ఇంతకీ ఏమాత్రం కట్టాలంటావు?"

"తెలీనివాళ్లు తెలీనట్లు వూరుకోవాలి. సరే కానీ, అరువందల రూపాయిల దాకా అవుతుంది" అన్నాడు శేషాద్రి. ఇది విని నూరమ్మ విస్తుపోయింది.

"అమ్మ బాబోయ్! అంతెందుకురా నాయనా" మాట పూర్తవకుండానే ప్రక్క గదిలోంచి పత్రిక చేత్తో పుచ్చుకుని సుందరి సుడిగాలిలా వచ్చిపడింది.

"ఏమేవ్! నా కొడుకేం మింగేస్తున్నాడనుకుంటున్నావా? బి. యస్. సీ. చదువంటే మాటలా? వాడుకాబట్టి అంత పొదుపుగా చదువుకొస్తున్నాడు. పైగా మద్రాస్‌లో చదువాయెను. బియ్యం శేరు రూపాయిన్నర అమ్ముతున్నాయి. అయినా, పరాయివాడికి పెడుతున్నావా ఏం? పెంచుకున్న వాడికేగా!" సాగదీసింది సుందరి.

"అయ్యో రామా! నేచదువుకోకపోయినా, చదువులమాట యెరుగుదును. ఇంత డబ్బవుతుందని ఎక్కడా వినలేదమ్మా" అంది కామాక్షమ్మ కందులు కొలుస్తూ.

"అవునవును. వీడి వంక పెట్టుకుని మేమే తినేస్తున్నాం. అవునా? మనసులో మాట అంతేగా? ఎవరెరగనిది."

"నిన్నేమన్నానే అమ్మా! నువ్వు మాత్రం పరాయిదానివా ఏమిటి? తింటే తింటావు" అంది. వెంటనే, నోరు జారానే అని నాలిక కరుచుకుంది. కాని సుందరి మాట పూర్తికే పోనివ్వలేదు.

"తింటే తింటాను. అవును. కూటికి గతిలేకేం మీకు పెంపిచ్చుకున్నాం. వీడి వంక పెట్టుకునిప్పుడు పొట్టపగిలేటట్టు తింటున్నాం. మా కర్మ కాకపోతే, కన్న కొడుకుని పెంపిచ్చుకోవట మెందుకు? మాటలు పడటం ఎందుకు? ఆయనకి మొదటే చెప్పాను. ఎందుకొచ్చిందండీ అని. వింటేనా?" అంటూ చీర చెరగుతో కళ్ళొత్తుకుంది సుందరి.

"అదేమిటే అమ్మాయీ. నేను మాత్రం తప్పుమాట ఏమన్నానే. మంగళవారంపూటా ఏడుస్తావు. ముసలి ముండని నోరు జారానే అనుకో. అయినా ఎల్లాగో మీదే గదమ్మా యిదంతాను."

"పేరుకి మాదేను. అయితేనేం. తలలు బోడులైన తలు. పులు బోడులా! ముసలాళ్లయినా కాపీనం పోదు. ఎంతైనా డబ్బంటే అల్లాగుండాలి" సుందరి ముఖం కోపంతో జేవురించింది. తన తల్లికి ఏభై అయిదేళ్లు పైబడ్డాయా. ఇంకా నిత్య తాంబూలం, మెట్టూరు మిల్లుపంచలూను. ఆవిడ పెదవి ఎరుపు చూస్తే, సుందరికి తనచుట్టూ మంటలు లేచినట్లుంటుంది. ఆవిడ నీటూ ఆవిడ హోదా? అబ్బో!

ఇటు కామాక్షమ్మగారికి ఎటుచెప్పడానికీ తోచలేదు. ఏమాటన్నా తనమీదకే వస్తోంది. ఇదంతా డబ్బుమూలంగా కదా! తనకి మాత్రం ఎవరున్నారు. ఆ కూతురూ, మనవడేగా.

కూతురికీ ఆసంగతి తెలుసునాయెను. మరెందుకో తనంటే అంతకక్ష.

"నాకేం కాపీనం వుందే అమ్మా. ఒక్కగానొక్క కూతురివి. నీకోసం కాకపోతే ఎవరికోసమే అడ్డమైన కోర్టులూ తిరిగి నిలబెట్టానీ ఆస్తి? నాకెందుకీ రొష్టు? కూడా తీసికెళ్తానా? నా అనంతరం, నీ కొడుకేగా అనుభవించేది."

"ఇదిగో! మీరిద్దరూ యివ్వాల్టికింక వూరుకోరా? ఏయ్ అమ్మమ్మా! నోరు మూసుకుంటావా? మూసుకోవా? పెద్దదానివని చూస్తున్నాను" అంటూ జయ్యిమని లేచాడు శేషాద్రి.

"బాబూ శేషూ! చూడు పెద్దదేవిటి పెద్దది. పెద్దయితేమాత్రం కాపీనం నాయనా కాపీనం. అల్లాగుండాలి డబ్బంటేను" అంటూ కొడుక్కి విడమర్చి చెప్పింది సుందరి.

"ఇదిగో! ఏమనుకుంటున్నావో నేనంటేను. నాన్నరానీ నా తడాఖా తెల్సొస్తుందిగాని. నాకు నీగోడంతా అనవసరం. ఆ అలమూరు రైతుదగ్గిర వెయ్యిరూపాయలదాకా వుంచావటగా. అవిచ్చెయ్ నా చదువుకి" అన్నాడు శేషాద్రి.

"అయ్యో! ఆడబ్బు నీకిచ్చేస్తే యీ ఏడాదీ ఎల్లా గడుస్తుందిరా? ఇంకా నాలుగు వందలు అప్పుంది దానిమీద."

"ఏమో! నువ్వేం చేసుకుంటావో నాకు తెలీదు. నాన్నరానీ నీపని చెప్తాను" అంటూ రంకెలేశాడు శేషాద్రి.

"దానితోటి నీకేమిటి. అవతలకి రారా." అంటూ పక్క గదిలోకి నిష్క్రమించింది సుందరి.

"ఇదేమిటర్రా. నీళ్లల్లో నిప్పులు. నేనేమన్నానని? నాఖర్మం కాకపోతే, నామారా వెళ్ళిపోవాలా? మాణిక్యంలాంటి కొడుకెళ్ళిపోవాలా? "అయ్యో నాకొడుకో, ఏలోకాన్నున్నావో కొని" అంటూ చచ్చిపోయిన కొడుకుని తల్చుకుని ఏడ్చింది కామాక్షమ్మ.

* * *

"రా! కామమ్మొదినా, భోజనా అయ్యాయా!" అంటూ ఆహ్వానించింది శేషమ్మ. కామాక్షమ్మ వుపవిష్టురాలయింది.

"ఆ! భోజనంలాగే వుంది. నిన్నరాత్రి వుపోషం. ఈ పూట వుపోషం" అంది కాళ్ళు చాపుకుంటూ.

"అదేం?"

"ఏముంటుంది. ఇంటింటా వుంది మట్టిపొయ్యి, మాయింటావుంది మట్టిపొయ్యి."

"అవునుగాని, ఏమిటమ్మా నిన్న మీయింట్లో ఏదో గంద్రగోళం అయినట్లుంది."

"ఆ! ఏంలేదు. ఎప్పుడూ వున్నదే. మనవాడు కాలేజీ చదువుకి డబ్బిమ్మన్నాడు. ఎంతవుతుందన్నాను. అది తప్పొచ్చింది."

"అదేమిటమ్మా! ఎక్కడాలేని విడ్డూరం. తల్లికీ కూతురుకీ పడకపోవటం."

"చూడు శేషమ్మొదినా, నే నేమన్నా తప్పు మాటన్నానా? ఆరువందలు అవుతుందన్నాడు. అంతవుతుందా అన్నాను. అంతే, తల్లీ కొడుకూ ఒక్కసారిగా విరుచుకుపడ్డారు."

"అయ్యో! అందులో తప్పుమాటేముందీ, అయినా తల్లిమీద కక్షేమిటో!"

"ఏమిటో! ఆ మనవణ్ణి పెంచుకున్నానన్న మాటేగానీ, మన స్తిమితంలేదు. వాళ్ళిద్దరూ కలిసి వాడికీ నాకూ కాకుండా చేస్తున్నారు. కొడుక్కి చెడుబుద్ధులు నేర్పుతున్నారు. వాళ్లు తినేదే గదమ్మా ముందూ, వెనకాగానీ."

"అదే నే ననబోయేదీనూ. మొగుడుచచ్చి చెట్టంతకొడుకుచచ్చి నువ్వేడుస్తూంటే ఆ పిల్లకామాత్రం తెలియొద్దూ."

"ఏమిటోనమ్మా! తల్లంటే దానికేమీలేదమ్మా. దానిపాలిటికి నేనో రాక్షసిని, నేనంటే పడి అల్లా యిదవుతానుగాని. వాళ్లుంటే పట్నంలో బియ్యం దొరకవంటే. మొన్న నీమధ్యే నాలుగు కుంచాలాడించి పట్టుకెళ్ళాను. సెలవలకివచ్చారు గదా! ఏదో నాల్రోజులు శుభ్రంగా తింటారని, చూసీ చూడకా ఖర్చుపెట్టున్నాను. అయినా నన్ను యాగీచేస్తున్నారు" అంటూ కళ్ళొత్తుకుంది కామాక్షమ్మ.

"వూరుకో కావమ్మొదినా! వూరుకో. ఇల్లాటివాళ్ళని కనుక్కున్న తర్వాత, అయినా నీ కూతురికీ అల్లుడికీ బుద్ధి లేకపోతే, పెంచుకున్నందుకు మనవాడికైనా బుద్ధుండొద్దూ. వూరుకో" అంటూ ఓదార్చసాగింది.

శేషమ్మదగ్గిర గోడు వెళ్ళబోసుకున్న

తర్వాత కామాక్షమ్మ మనస్సు కాస్త కుదుట పడినట్లనిపించింది. మరి కాస్సేపు కూర్చుని,

"ఇంతకీ నాఖర్మిల్లా వుంది. వెళ్ళొస్తాను శేషమ్మొదినా" అంటూ యింటికి బయలు దేరింది.

* * *

ఇంటికొచ్చేసరికి మధ్య గదిలో అల్లుడు కన్పించాడు.

అల్లుడు మొఖమటు తిప్పుకున్నా, "ఎప్పుడొచ్చావోయ్, జగన్నాథం" అని పలుకరించింది మాట వరసకి.

"ఎప్పుడొస్తే ఏంలెండి" అంటూ పక్కగదిలోకి వెళ్ళిపోయాడు. ఒక్క చూపులోనే పరిస్థితి మారిందని గ్రహించివేసింది కామాక్షమ్మ.

ఆ రెండ్రోజులూ కస్సు బుస్సులతోనే గడిచింది. అన్యాపదేశంగా, పిల్లిమీదో, కాకిమీదో పెట్టి మాట్లనుకోటంతోనే సరిపోయింది. ఆ రెండురోజులూ యించుమించు కామాక్షమ్మకు వుపోషమే.

"కాకి, అల్లా పెసరపప్పు పోసుకు పోతూ వుంటే ఇద్దరూ చూస్తూ వూరుకుంటారేమ్రా కాస్త కొట్టరాదూ" అంది కామాక్షమ్మ, వసారాలో కూర్చుని సంప్రదిస్తున్న తల్లీకొడుకుల్ని.

"పోనీ, దాన్నైనా తిన్నియ్, ఎవరికి పెట్టినా పెట్టక పోయినాను" అంటూ మూతి ముడిచింది సుందరి.

"ఏ ముక్కన్నా, ఎటొచ్చి ఎటుపడినా నామీదేగా తప్పంతా" అంటూ గింజుకుంది కామాక్షమ్మ.

అల్లుడొచ్చిన రెండోరోజు సాయంత్రానికి కాస్త రంగు తేలింది.

"ఏమండోయ్ అత్తగారూ, ఆ బ్బాయి చదువుకి డబ్బివ్వమంటే యివ్వరుటేం" అని సూటిగా ప్రశ్నించాడు జగన్నాథం.

"నేనేం ఇవ్వనన్నానుటోయ్ జగన్నాథం! ఆ ఆలమూరు రైతు దగ్గిర వెయ్యీ యిచ్చెయ్యమంటున్నాడు."

"యివ్వండి"

"అదేమిటోయ్, నువ్వూ అలాగంటావూ? మొన్న పైవేటుకి కావాలంటే చందనూరు రైతు దగ్గిర్నుంచి రెండొందలేభై పటుకొచ్చి యిచ్చానా? నేనుమాత్రం ఎక్కడ్నుంచి పట్టుకొస్తాను."

"ఆ వెయ్యీ పట్రండి."

"తెలుసున్న వాడివి నువ్వూ అల్లాగే అంటావా? ఆ వెయ్యీ యిచ్చేస్తే యీ ఏడాదీ గడిచేదెల్లాగా. అయినా దానిమీద మూడొందలు అప్పే వుందాయె. ఈ నాల్నెల్లనుంచీ నా చేతిలో నిల్వవున్న నాలుగొందలూ ఖర్చెట్టేశాను."

"చూశారా! మనం వచ్చామని నిలవా, గిలవా అంతా ఖర్చెట్టేసిందిట. విచిత్రం. మనం వచ్చి మూణ్ణెల్లయినా కాలేదు. అప్పుడే నాలుగొందలు అయిపోయాయిట. చూడండి" సుందరి చేతులు సాచుకుంటూవచ్చింది హాల్లోకి.

"అదికాదే అమ్మాయ్! మీరు లెక్క లడిగితే నేను చెప్పవలసి వచ్చింది. చూడు జగన్నాథం, ఆ మూడొందలవుప్పు పోను, యింకా ఆరొందలుంటాయి. దాంతోటి యీ ఏడాది గడవాలి."

"అవుగానిఅమ్మమ్మా! అన్నీ పండనే పండుతాయి. నీకు ఏడాది కారొందలు కావాల్టే?" అని పృచ్ఛచేశాడు శేషాద్రి పత్రిక పక్కనెట్టి.

"ఇంటికి మరామత్తు చేయించాలి. పన్ను కట్టాలి. ఇంకా ధాన్యం దంపించాలి. ఇంకా ఖర్చులన్నీ పోను నీ చదువుకి పంపించాలాయెను. ఇక్కడ నే బతకాలి. ఇంకా కోర్టులకీ, ప్లీడర్లకీ లెక్కపెట్టలేదు."

"చదువుకి తెగపంపేస్తున్నావు. నీ పొలాల డబ్బంతా వాడి చదువుకే అవుతుంది. క్రిందటేడు పూర్తిగా 1000 పంపలేక పోయావు. చాల్చాలు. రెండోవాడికి మేమే చెప్పించుకుంటున్నామా. ఎటొచ్చీ వీడికే నేమిటి బరువౌతా. వీడికి మేమే చెప్పించుకుంటాంలే. బాధ పడక" అంది సుందరి.

"నే నిప్పుడేమన్నానే అన్ని చదవటానికి? క్రిందటేడు ఆరొందలొకసారి, నాలుగొందలొకసారి, రెండొందలేభై ఒకసారి మొత్తం వెయ్యి మీదా రొండొందలేభై పంపేనా. ఇపుడింకా డబ్బు సర్దుబాటు కాలేదు. అదీ అంటూంటా."

"కూడా తీసుకుపోతా వేమిటే ముసలి దానా" అన్నాడు శేషాద్రి.

"పోన్లెండి అత్తగారూ! మేమే చెప్పించుకుంటాం. మీకు దత్తతివ్వటం మాది బుద్ధి తక్కువే. ఇప్పటికేనా తెలిసొచ్చేటట్టు చేశారు."

"నే నేమన్నా తప్పేనర్రా. నా కెందుకు నోరు మూసుకుంటాను. మీ యిష్టం వచ్చినట్లు చేసుకోండి. కాని ఆ వెయ్యి రూపాయిలూ ముట్టుకోటాని కొల్లగాదు" అంది కామాక్షమ్మ ఖచ్చితంగా.

"చూడండి. తను మాట్లాడుదుట. ఆ వెయ్యి ముట్టుకో కూడదట. గడుసు తనమంటే అల్లాగుండాలి. ఎలాగయినా కోర్టెక్కిన మనిషాయెను. కోర్టు పక్షి" అంది సుందరి.

"నే నెన్ని కోర్టులెక్కినా, ఎంవరి. కాళ్ళట్టుకున్నా మీకోసమే గదట్రా. నా మారాజు బాగున్నప్పుడు, సుందర్రామయ్యాగారి కోడలు ముఖం అంటే ఎల్లాంటిదో, ఎవరైనా ఎరుగుదురా. గుడ్డలు కట్టిన బండిలోనేగాని, వీథి ఎప్పుడైనా నన్నెరుగునా. నా ఖర్మం కాలిపోయింది. ఇప్పుడెక్కడ చూసినా నేనే. జడ్జీ మొదలు బంట్రోతు వరకూ "ఏం కామాక్షమ్మ గారూ" అని పలుకరించేవారే." అంటూ ముక్కెగ పీల్చింది కామాక్షమ్మ.

"నిన్నెవ్వ డెక్కమన్నాడు అన్ని కోర్టులూను" అని సుందరంది.

"లేకపోతే ఎవడు చూస్తాడమ్మా. ఎవడికెక్కవాలి. అల్లా అన్ని కోర్టులూ తిరగబట్టే యీ పదిహేను ఎకరాల మిట్టా, అయిదెకరాల సర్వీ తోటా, యిల్లూ నిల్చాయనుకో. ఇంకా యిప్పటికి తగువు లావల్లేదాయెను."

సందుకోసం చూస్తున్న జగన్నాథం,

"నే చెప్తాను వినండి అత్తా! మీరు పెద్దవారయ్యారు. వాడికా మైనార్టీ వదిలింది. మీరింక తప్పుకోటం భావ్యం" అని అసలు సంగతి తేల్చేశాడు.

"ఆ! ఆ!" కామాక్షమ్మ ఆగిపోయింది.

"నే చెప్పలేదూ. ఎందుకొచ్చిందండీ. ఎంత ముసలిపీనుగైనా కాఫీనం వదలొద్దూ" అంటూ బారలు సాచింది సుందరి.

కామాక్షమ్మ కొస్త తమాయించుకుంది.

"అలాగే. నా తదనంతరం దత్తుడైనందుకు వాడికే చెందుతుంది యీ ఆస్తంతాను. నే మాత్రం యివ్వనన్నానా?"

"నువ్వెప్పుడు చస్తావో ఎవడికెరుక. అంత వరకైనా వాడు బతికేట్టు లేదు నీవరస చూస్తే" అంటూ జగన్నాథంకేసి చూసి హెచ్చరించింది.

"నిజమే! అల్లాగే వుంది. ఇంతాస్తుందని వాడికేం పోషణ జరుగుతోంది. పేరుకేగాని" అన్నాడు జగన్నాథం ఆలోచిస్తున్నట్లు.

"పెంచుకున్నానన్న మాటేగాని, వాడు నాదగ్గిరున్న దేదీ, నే రాసిస్తానే అనుకోండి. వాడు నన్ను సరిగ్గా చూడకపోతే..." అని తన సంశయం ఆత్మీయురాలైన కూతురు దగ్గిర బయలు పెట్టింది.

"అది నీ ఖర్మ. ఏమండోయ్, దగ్గిరుంచుకో నివ్వలేదట. నయం తేల్చింది. ఏ విషమో పెట్టి కొడుకుని చంపినట్లే వీణ్ణి యీ పాటికి చంపేసుండేది, వుంచాం కాదు" అంటూ పొలికంటు తీసింది సుందరి.

"అవునేవ్! నిజమే. అమ్మా, నీ తల్లి కెంతాలోచనుందేవ్" అని బలపరిచాడు జగన్నాథం.

"చూశారా! ఎంత చెడ్డా ఆ తల్లి కూతుర్ని కదూ. ఆ దెక్కడండీ. జప్పన్న కోర్టులన్నీ ఎక్కొచ్చిన రకం."

ఇల్లా కూతురూ, అల్లుడూ దూషణదండకం తనెదురుగుండానే వల్లించేసరికి, కామాక్షమ్మ గారికి నోటమాట పెగల్లేదు.

"తొందరగా మనం యిక్కణ్ణుంచి వెళ్ళిపోవాలి. లేకపోతే మన మేమవుతామో అని భయంగా వుంది" అని పదేళ్ళవాడైన రెండో కొడుకు రంగడిని దగ్గిరకు తీసుకుంది సుందరి.

"ఆ! అంత తొందరగా వదులుతామా! ఏమమ్మోయ్! కామాక్షమ్మగారూ! శృంగపూడి జగన్నాథం అంటే ఎవరనుకున్నారో! బుర్రలు తీసి బుర్రపెట్టే రకం. చూసుకోండి నా ప్రతాపం. ఇకమీదటుంది మీ పని" అని వికసించిన ముఖం కలవాడై లేచి వీథిలోకి వెళ్ళాడు. ఆ వెంటనే సుందరీ, శేషాద్రీ నిష్క్రమించారు. కామాక్షమ్మగారు నోటమాటరాక కూలబడిపోయింది.

ఇదేదో, చిలికి చిలికి గాలివాన అయ్యేలాగుందని, కామాక్షమ్మగారు ముందుగా. జాగ్రత్త పడింది. కాని ఆవిడెంత జాగ్రత్త పడినా మరిమూణ్ణాళ్ళకి బ్రహ్మాండం బ్రద్దలవనేఅయింది.

ఆనాడు మధ్యాహ్నం జగన్నాథం వసారాలో బియ్యం ఏరుతున్న కామాక్షమ్మగారి దగ్గరకు వడగళ్ళ వానలా వచ్చిపడ్డాడు.

"సుందరీ, మీ అమ్మ చెంబూ, ముంతా ఏమున్నయో, ఇవతల పడెయ్యి. శేషాద్రీ యిల్లారా, నిన్ను అభినందించాలి, అని రంకె తీశాడు జగన్నాథం. ఈ కేకలకి కామాక్షమ్మగారి గుండె దడదడ లాడింది.

ఏంములిగిందో అని, గదిలోంచి సుందరీ, హాల్లోంచి శేషాద్రీ పరుగుత్తుకొచ్చారు.

"ఇదుగో నమ్మోయ్! ఈ యింట్లో వుండటానికి నీకు హక్కు లేదు" అన్నాడు జగన్నాథం. కామాక్షమ్మ గారికిది నిజమో, వేళాకోళమో పాలుపోలేదు. ఆఖరికి,

"అదెల్లాగోయ్!" అని బిత్తర పోయింది కామాక్షమ్మ.

"ఆస్తంతా యిప్పుడబ్బాయిదే. మీకు చిల్లిగవ్వ కూడా లేదు. వీడు పెడితే కద్దు లేకపోతే లేదు."

"నే బతికుండగానే వాడికెల్లాగొస్తుంది?"

"అదంతా మీ కనవసరం. అయినా చెపుతున్నాను. వాడికి మైనార్టీ తీరింది. వాడు మీకు దత్తుడాయెను. మీ కొడుకు విల్లులో వ్రాసిన ప్రకారం వీణ్ణి మీరు పెంచుకున్నారు. అందుచేత ఆస్తి వాడిదే.మీరింక తప్పుకోవచ్చు"

"నా తదనంతర హక్కు కదా !"

"అల్లాకాదు. 'లా' యిల్లాగే చేస్తుంది. మేం పెడితేనే మీకుంది."

"అల్లా వీలుకాదు" అంది కామాక్షమ్మ.

"నోరెత్తటానికి వీల్లేదు! నే నెవర్ననుకున్నావో? శృంగపూడి జగన్నాథం అంటే మాటలనుకున్నావా? పోనీ, బాగా బతికిన దానివని ఇంతటితో ఊరుకున్నాను. లేకపోతే నీగడ్డి నీకెడుదును."

వంటింటి తలుపు గొళ్లెంపెట్టి సుందరొచ్చింది. ముఖంలో వెర్రిసంతోషం తాండవం ఆడుతోంది.

"ఇంక పెద్దమ్మ దయచెయ్యొచ్చు. మేం పెడితే కద్దూ లేకపోతే లేదు. అయినా అడ్డమైనవాళ్ళకి మేం ఎక్కడ పెట్టగలం", అంటూ యిప్పటికైనా గ్రహించావా నా ప్రతాపం, అన్నట్లుగా కామాక్షమ్మకేసి చూసి నిరసించింది.

ఆ చూపు కామాక్షమ్మకి ములుకులా గుచ్చుకుంది. మొగుడు కొట్టినందు కేడవాలా, సవితి దెప్పినందు కేడవాలా, అన్నట్టు; ఆస్తి పోతే పోయింది, మధ్య దీని సాధింపేమిటో! ఆ కూతురు పుట్టకపోయినా బాగుండేది. కామాక్షమ్మ, ఏదో ఓరోజున మిన్ను విరుగుతుందని అనుకుంటూనే వుంది. కాని ఆ మిన్ను విరిగి, పరాగ్గావున్న తనమీదే సూటిగా పడుతుందని అనుకోలేదు.

కాని తనంత సులభంగా వదిలేస్తుందా! తన జోళ్ళు కోర్టులకి తిరగటంతోటే అరిగిపోయాయి. ఈ దెబ్బతోటి చిరిగినా సరే, తను వదలదు. అయినా తెగు ప్లీడర్లని కనుక్కోవాలి. ఇల్లా అనుకుంటూనే చీరకొంగు సరిచేసుకు బయలుదేరింది.

* * *

"అదేమిటి కామమ్మొదినా అల్లాగున్నావు?" అంది శేషమ్మ, మెల్లెక్కుతున్న కామాక్షమ్మని చూసి.

"ఇంకేముంది శేషమ్మొదినోయ్! నా నోరు నొక్కేశారేవ్. నే బ్రతికుండగానే పాతేశారేవ్" అంటూ భోరుమంది.




"ఏమొచ్చిందమ్మా, ఏమొచ్చింది. అంతా కులాసాయేనా?" అని కామాక్షమ్మని కూర్చో పెట్టింది.

"నేనేం పాపం చేశానమ్మా, ఏనక్షత్రాన పుట్టానోగాని" అని సంగతి వివరించింది కామాక్షమ్మ శేషమ్మకి. అంతావిని ముక్కుమీద వేలేసుకుంది శేషమ్మ.

"ఔరా! కన్న కడుపైనా చూడలేదు. ఎంతపని చేసింది? అల్లాగుండాలి కూతురంటే."

"దానికి మొదట్నుంచీ లేదమ్మా నేనం టేను. క్రిందటి జన్మలో నిప్పు పూజచేసి బొగ్గులు నైవేద్యం పెట్టుంటాను" అని ముక్కుగ పిల్చింది కామాక్షమ్మ.

"అల్లా ఎల్లా లాక్కున్నారు ఆ స్తంతాను. నీ తదనంతరం కదా వాళ్ళకి చెందాల్సింది?" అంది శేషమ్మ.

"అదేమిటో, 'లా' లో అల్లాగుందట. మన ప్లీడరుగారుకూడా అల్లాగే అన్నారు" అంది కామాక్షమ్మ.

"పోనీ ఆ కూతురికి లేకపోతే, మనవడి కేనా వుండొద్దూ."

"వాడికుందేదో లేదో గాని, చదువుకని వాణ్ణెట్టేసుకు నూరిపోసేసేరే తల్లీ, పిల్లిద్దరూను."

"ఏమిటోనమ్మా చాలా చిత్రంగా వుంది."

"అయిన పొలాలన్నీ అల్లుడొచ్చిందగ్గిర్నుంచీ బేరానికి పెట్టేడట. అయినకొడికి ఆ తోట తెగనమ్మేసి పోసుకున్నారు ఈ నాల్రోజుల్లోనూ. వాళ్ళసలనుకునే వచ్చుంటారు."

"అయితే యిల్లయినా మిగిల్చేరా."

"అయ్యో. లేదమ్మా! అదీ అర్పణమే. నాకూ ఆ యింటికీ ఋణం తీరిపోయింది. నా బ్రతుకంతా అందులోనే వెళ్ళ మారిందే శేషమ్మా" అని చెరగుతో కళ్లు తుడుచుకుంది కామాక్షమ్మ.

"పోనీ, నువ్వుండొచ్చా" అని సందేహంగా అడిగింది శేషమ్మ.

"అబ్బే, నిన్ననే పొమ్మన్నారు వాళ్ళు. ఆ వున్న పాత్రసామాను యివతలగదిలో పడేశారు. "నువ్వు తొందరగా వీటిని తీసుకుపోతే మేం యింటికి తాళం వేసుకోవాలి" అని మొఖం యెదుటే అందమ్మా కూతురు. మళ్ళా ఆ యింట్లో నే విస్తరెయ్యలేదు."

"మరి నీబ్రతుకు?" అంది శేషమ్మ.

"బండలయింది. ఇంక వాళ్ళవల్ల కానిదల్లా నాపుట్టింటూరు పసుపూ కుంకానికిచ్చిన రెండెకరాలున్నూ, నాపసుపూ కుంకం అప్పుడే వెళ్ళిపోయాయి కాని, అదే యిప్పుడింకగతి" అని చచ్చి స్వర్గాన్నున్న మొగుణ్ణి తల్చుకు కంట నీరోడ్చింది కామాక్షమ్మ.

"వూరుకో అమ్మా వూరుకో. వెళ్ళినవాళ్లు మరి రారుగా" అని ఓదార్చింది శేషమ్మ.

"నాకేం దారి కన్పించటంలేదు శేషమ్మాయ్! నన్నప్పుడే తీసుకెళ్ళకపోయాడా దేముడు. ఇప్పుడేం ముఖంపెట్టుకు వూర్లో కెళ్ళనే తల్లీ! ఎవరింట్లో వుండనే అమ్మా" అని మళ్ళీ భోరుమంది.

"ఏం చేస్తామమ్మా! ఎక్కడి కెడతావు. దివాణంలాటి యిల్లుండీకూడా, పరాయింట్లో వుండాల్సినదాని వయ్యావుకదా! ఎక్కడి కెడతావు. ఇక్కడే మాయింట్లో ఓగదిలో వుండుగాని, చెంబూ తప్పేలా తెచ్చుకో" అని భరోసా యిచ్చింది శేషమ్మ.

"ఈ మాత్రం కన్నకూతురికి లేకపోయెను కదా! అవసరాని కడ్డుపడేవాళ్ళే బంధువులు."

"దీనికేం భాగ్యం ఒదినా! ఆ రెండెకరాలమీదా ఓ పది బస్తాలొస్తే, రెండురూపాయల కోగది తీసుకుంటే, నీ బ్రతుకు సుఖంగా వెళ్ళిపోతుంది? నువ్వేం బాధ పడకమ్మా. నీకూతురు పొమ్మంటే మేం అందరం ఏమైపోయాం. నీకది పుట్టనే లేదనుకో" అని ధైర్యం చెప్పింది శేషమ్మ.

"వస్తాను శేషమ్మొదినా! నా ప్రాణాలకే వచ్చిందీ దత్తతు. ఎల్లాగో అనుభవించేవాళ్లు వాళ్ళే. అప్పుడైతే యిద్దరు మనవలూ తిందురు. ఇంతకీ ఖర్మిల్లావుంటే" అంటూ లేచింది కామాక్షమ్మ.

ఆ సాయంత్రం వున్న పాత్ర సామానూ, ఓ మంచం, పెట్టె తీసుకుని కామాక్షమ్మగారు దత్తుడి ధర్మమా అని నాలుగు రూపాయిల అద్దెకి శేషమ్మ గారింట్లో ప్రవేశించింది.